## సోమరాజు సీక్రెట్

సోమరాజు ఆవేళ ఆఫీసుకివెళ్లటానికి చకచకా తయారైపోతున్నాడు. షేవు చేసుకున్నాడు. స్నానం చేశాడు.తదువ్వుకున్నాడు. మొహానికి క్రీము, పౌడరు రాసుకున్నాడు. ఇస్త్రీ చేసి రెడీగా పెట్టుకున్న కొత్త బుష్ షర్టు వేసుకుని అద్దంలో చూసుకుంటున్నాడు.

భర్త వాలకాన్ని, ఉత్సాహాన్ని గమనిస్తున్న కళ్యాణికి ఆశ్చర్యంవేసింది. ఇటీవలి రోజుల్లో భర్తలో అంత ఉత్సాహం ఆమె చూడకపోవటంతో– కారణం తెల్సుకోవాలన్న ఉద్దేశంతో "ఏవండీ... ఇవాళ మీ ఆఫీసులో ఏదైనాఫంక్షనా? కొత్తొక్కా వేసుకున్నారు. పైగా మోహం వెలిగిపోతోంది. ఏమిటి కారణం" అనడిగింది.

సోమరాజుకి ఆమె ప్రశ్న వినంగానే చిర్రెత్తుకొచ్చింది. ఈ మధ్యన ఆమె ఏం అన్నా కోపం వచ్చేస్తోంది. అన్నం తింటారా అనడిగితే అన్నం తినక గడ్డితింటానా! ఏమిటా ప్రశ్న అని పోట్లాడాలనిస్తోంది. పోట్లాడుతున్నాడు కూడా. అంచేతనే రోజూ కనీసం రెండు సార్లయినా వాళ్లిద్దరికి మాటామాటా అనుకోక తప్పటం లేదు.

పెళ్లయి పదేళ్లు అయినా పిల్లల్లేరు. కళ్యాణి పెద్ద అందగత్తె కాకపోయినా అనాకారికాదు. సంసార పక్షంగా వుంటుంది. సోమరాజుకి సంసారపక్షం అస్సలు సూటుకాదు. ఆఫీసులో టైపిస్టు బాలామణి లాగా వుండాలనుకుంటాడు.

బాలామణి అందగత్తెకాదుగాని అందంగా తయారవుతుంది. కనుబొమలు కత్తిరించుకుని, దిద్దుకుంటుంది. రకరకాల పౌడర్లు, క్రీములు వాడుతుంది. జుట్టు కత్తిరించుకుని ఆర్టిస్టిగ్గా ముడేసుకుంటుంది. నీటుగా డ్రస్సప్పవుతుంది? తియ్య తియ్యగా మాట్లాడుతుంది.

పదిరోజుల క్రితం బాలామణి చిన్న ప్యాకెట్టు పుచ్చుకుని సోమరాజు దగ్గరకివచ్చి "ఈ షర్టు పీసు చూడండి. ఎలా వుంది! మా తమ్ముడు దుబాయి నించి మావారికని తెచ్చాడు ఈ కలరు, డిజైను ఆయనకి అస్సలు బావుండవు. వెంటనే మీరు గుర్తుకొచ్చారు. మీకయితే ఫెంటాస్టిగ్గా వుంటుంది." అంటూ వంద రూపాయలు ఖరీదు చేసే పీసుని రెండొందలకి అంటగట్టింది.

సోమరాజు ఆ దెబ్బతో సోలరాజయిపోయి, వెంటనే షర్టుకుట్టించేసి, వేసుకుని ఆఫీసుకి వెళ్లాలన్న హడావుడిలో వుండగా భార్య అనే వ్యర్థపదార్థం అలా అడిగేసరికి కోపం రావటం సోమరాజుకి సహజం.

సోమరాజు ఆఫీసుకి వెళ్లేసరికి బాలామణి ఇంకా రాలేదు. అంచేత టీ తాగి వద్దామని పక్కన వున్న పాక హోటల్‌కి వెళ్లాడు. టీ తాగేడు. సిగరెట్టు ముట్టించి వచ్చి ఆఫీసులో వున్న పెద్ద చెట్టుకింద నిల్చుని ఆలోచిస్తున్నాడు. తను బాలామణికి ఎదురుగా వెడతాడు. ఆమె తనని చూస్తుంది. మీరిచ్చినషర్టుపీసే. ఎలా వుంది అనడుగుతాడు.ఆమె కన్నార్పకుండా తన వంక తదేకంగా చూస్తూ "ఓ సూపర్బు. లవ్లీ–" అంటూ– సోమరాజు ఆలోచనలకి బ్రేక్ పడింది. పై నించి ఏదోమీదపడిన ఫీలింగ్– తెప్పరిల్లి చూసుకున్నాడు. చెట్టు పైన కాపురం వుంటున్న పిట్టరెట్ట వేసింది.

అదొచ్చి సోమరాజు షర్టుచేతిపైన ఇండియా బొమ్మలా పడింది. సోమరాజుకి కోపం వచ్చింది. ఏడుపొచ్చింది. ఏడుస్తే బాగుండదని కోపంగా చెట్టుపైకి చూశాడు. రెట్టవేసిన పిట్ట ఇంకా అక్కడే వుంది.

సోమరాజు దాన్ని చూశాడు. అది సోమరాజుని చూసింది. చూపులు కల్సుకున్నాయి.

తుపాకీ వుంటేదాన్ని కాల్చి పారేయ్యాలన్నంతగా కోపం వచ్చింది సోమరాజుకి. తన ఆనందాన్ని పొట్టన పెట్టుకుంది. తన ఉత్సాహంపైన నీళ్లు చల్లింది. దీన్ని ఏం చేసినా పాపంలేదు అనుకున్నాడు.

కాని పిట్టకి మాత్రం సోమరాజు వాలకం, ఆ చూపులు అస్సలు నచ్చలేదు. అంచేత అతన్ని అస్సలు పట్టించుకోనట్లు పిట్టచూపులు చూస్తూ తోక విదిలించి తల తిప్పేసుకుంది. 'ఈ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి రేపు రెట్టల వేళ కల్సుకుందాం. అంతవరకు సెలవు... అంటున్నట్లు తుర్రున ఎగిరిపోయింది– నీచావు నువ్వు చావు అన్నట్టు సోమరాజుని అక్కడ వదిలేసి.

సోమరాజు చొక్కా వంక చూసుకున్నాడు.

రెట్టపడినంత మేర అసహ్యంగా వుంది. షర్టు అందమే పోయింది. వున్నట్టుండి అతనిలో నిరుత్సాహం ఆవహించేసింది. ఏమిటీ జీవితం అనిపించింది? దేవుడు ఎంత నిర్దయుడు కాకపోతే పిట్టల్ని చెట్లపైన వుంచి, మనుషుల్ని నేలపైన వుంచటం

ఏమిటి?

పైనించివర్షించే రెట్టలు మానవుల అదృష్టాన్ని తారుమారు చెయ్యటం ఏమిటి? అసలు తనెందుకు ఇక్కడికి రావాలి. సరీగ్గా ఆ సమయానికే ఆ పిట్టకి రెట్టవెయ్యాలన్న కోర్కె, అవసరం కలగటం ఏమిటి? అదొచ్చి భూ ప్రపంచంలో ఎక్కడా చోటులేనట్లు బాలామణి ఇచ్చిన షర్టుపైనే పడాలా?

సోమరాజులోని ఆలోచనాతరంగాల్ని ఎవరైనా మానసిక శాస్త్రవేత్త అర్థం చేసుకోగలిగితే– అమాంతం కాగితాలు, కలం పుచ్చుకుని వెయ్యి పిట్టలు, లక్షరెట్టలు అనే ఉద్గ్రంథం రాసెయ్యగలడు.

దూరంగా బాలామణి రావటం సోమరాజు గమనించాడు. ఈ అవతారంలో ఆమె కంటబడితే నవ్వులపాలుకాక తప్పదు అనుకుని, చటుక్కున చెట్టువెనక్కు తప్పుకున్నాడు. రహస్యంగా చూస్తున్నాడు. అంతలో పైనించి మళ్లీ ఏదో టుప్‌మంటూ ఈసారి నెత్తినపడింది.

సోమరాజు కంగారుగా తలెత్తి చూశాడు.

పైన అదే పిట్ట, అదే పని... సోమరాజుకి ఏడుపొచ్చింది. ఈ దిక్కుమాలిన పిట్టకి  ఈపని తప్ప వేరే ఇంకేం చేత కాదా అనుకున్నాడు. పిట్టమాత్రం పీసుపుల్‌గా సారీ సోమరాజూ. టీకిట్ ఈజీ, అంటున్నట్లు తోకతిప్పి అక్కడినుండి తుర్రుమని ఎగిరిపోయింది.

ఎందువల్లనో సోమరాజు ఆలోచనల్లో కళ్యాణిని అనవసరంగా తిట్టిపోశాను. దానివల్ల ఇలా జరగలేదు గదా అనే ఆలోచన రావటంతో కంగుతున్నాడు. ఆ భావం క్షణక్షణానికి బలం పుంజుకోసాగింది. జేబులోంచి కర్చీఫ్ తీసి తలపైని, షర్టు చేతిని శుభ్రం చేశాడు.

తర్వాత టీ తాగిన హోటల్‌కి వెళ్లి నీళ్లు తీసుకుని చొక్కాని కడిగాడు. సగం షర్టు పొడిగా సగం షర్టు తడిగా– చూసేందుకు విడ్డూరంగా వుంది.

షర్టు ఆరేవరకు సైకిల్ స్టాండులో తలదాచుకోవడం నయం అన్చెప్పి ఆ వైపుగా వెళ్లాడు.

అక్కడ పీకేమూర్తితగిలాడు. తగిలాడు అంటే కల్సాడని. రెండు స్కూటర్సుని దగ్గరికి లాగి శరీరంలో అర్థ భాగాన్నిఒకదానిపైన, శేషభాగాన్ని రెండో స్కూటరు పైన డిపాజిట్ చేసి మర్రి ఆకుపైన విష్ణుమూర్తులవారు విశ్రమించినట్లు పడుకునున్నాడు పీకేమూర్తి.

పీకేమూర్తి పూర్తిపేరు పెరుగు కృష్ణమూర్తి... మనిషిలో వేదాంతపు దోరణి ఎక్కువ– ప్రతి సంఘటనకి భాష్యం చెప్పగలడు. షేర్ల వ్యాపారం చేస్తుంటాడు.

మార్కెట్టునీ మనుష్యులని స్టడీచెయ్యటం బాగా అలవాటు. సైకిలు స్టాండువద్దకి వచ్చిన సోమరాజుని ఓరకంట చూశాడు.

మామూలు సోమరాజు కాదు.

అర్థమైపోయింది కొన్ని మొహాలు ఏవీదాచలేవు. మొత్తం చెప్పేస్తూ వుంటాయి. అటువంటి అరుదైన మొహాల్లో సోమరాజు మొహం ఒకటి.

"ఏం గురూ? షర్టు కొత్తదిలా వుంది? ఏమిటి విశేషం" అనడిగాడు పీకే మూర్తి.

సోమరాజు బాగా దగ్గరకి వచ్చి అతని ప్రశ్నకి సమాధానం ఇవ్వకుండా "మూర్తీ నాకో సందేహం కలిగింది. నువ్వే దాన్ని తీర్చాలి. ఇంట్లో భార్యల్ని ఏడిపిస్తే ఆఫీసులో పక్షులు రెట్టలు వేస్తాయా" అనడిగాడు.

పీకే మూర్తికి ఆ ప్రశ్న అస్సలు అర్థం కాలేదు సరికదా పైగా అయోమయం అనిపించింది. ఇంట్లో భార్యకి, ఆఫీసులో పక్షికి ఏమిటి లింక్సు, అసలయినా ఆఫీసు పక్షులేమిటి? పక్షులు ఎక్కడయినా వుంటాయికదా? సోమరాజుకీ సందేహం ఎందుకు కలిగింది? తెల్సుకోవాలి గనక పీకేమూర్తి లేచి కూర్చుని, మిత్రుడి భుజంపైన చెయ్యి వేసి దగ్గరికి లాక్కుని, ఆప్యాయంగా "అసలేం జరిగింది" అన్నాడు.

సోమరాజుకి జరిగింది చెప్పటమా మానటమా అని క్షణం సందేహం కలిగిందిగాని, వెంటనే అద్భుతమైన ఆలోచనరాగా"నాకో

ఫ్రెండున్నాడు. నీలాగే పేరు వెంకటశివం. బాగా కావాల్సినవాడు.” అని మొదలు పెట్టి జరిగింది మొత్తం ఏదీ దాచకుండా పూసగుచ్చినట్టు వెంకటశివం అనే పాత్రకి అనవ్వయించి చెప్పేసి–

“అది గురూ జరిగింది. మాఫ్రెండుకి చాలా బాధగా వుంది. మానసికంగా క్రుంగిపోతున్నాడు. అతని జీవితానికో సలహా చెప్పి నువ్వే కాపాడాలి” అన్నాడు.

“అలాగే మీఫ్రెండ్‌ని నా దగ్గరికి తీసుకునిరా. కొన్ని సందేహాలున్నాయి అడిగినాక సలహా చెప్తా...”

“వాడురాడు. వెంకటశివం మొహమాటం మనిషి. తన విషయాలు ఒకరికి చెప్పుకోటానికి కూడా ఇష్టపడడు. వాడి బాధ చూడలేక నేనే అడిగానంతే... పైగా ఈ సంగతి తెలిస్తే నాపైన మండిపడతాడు.”

పీకేమూర్తికి మొత్తం స్టోరీ అర్థమైపోయింది.

“సరే– ఓపని చెయ్యి. నే చెప్పింది చెప్పినట్టు మీ ఫ్రెండ్‌కి నువ్వు చెప్పు నీకు బుద్ధి లేదు....”

“నాకా” అన్నాడు సోమరాజు.

“అని నువ్వు అతనికి చెప్పాలి. సమస్య నీదన్నట్లునే మాట్లాడతా. నువ్వు నే చెప్పేదంతా విని అతనికి చెప్పే రీతిలో చెప్పుకో! ఏం?

సోమరాజూ! కొత్త షర్టు మీద పిట్టరెట్టవెయ్యటానికి ఇంట్లో భార్యని ఏడిపించటమే కారణమా అన్న ఆలోచన రావటం చాలా దురదృష్టకరం. ఆ ఆలోచన నీ మానసిక స్థితిని సూచిస్తోంది. భార్యని పెట్టుకుని ఇంకో స్త్రీ పైన వ్యామోహం పెంచుకోవటం తప్పు అని అంతరాంతరాల్లో నువ్వు గ్రహించటం ఈ అశాంతికి అసలు కారణం. అన్నిటికి నీ ఆలోచన్లే కారణం.

నీకు నువ్వే ప్రశ్నల్ని, సమాధానాల్ని సృష్టించుకున్నావు. సుఖం సంతోషం అనేవి ఎక్కడో దూరంగా లేవు. మనలోనే వున్నాయి. మన సుఖానికి మనమే కారణం. మన దుఃఖానికి మనమే కారణం. ఇంట్లో వున్న భార్య అందంగా కనిపించకపోవటానికి, ఆఫీసులో గర్ల్ ఫ్రెండు అపురూప సౌందర్యవతిగా కనిపించటానికి నువ్వే కారణం.”

“మనమే కారణమా? ఎలా?”

“ఇంట్లో వున్న భార్య నీసొంతం అనే భావం, గర్ల్ ఫ్రెండు సొంతం కాదు అనే భావం గూడా నీలోనే పుట్టాయి కాబట్టి” అన్నాడు పీకే మూర్తి.

“అది నిజమేగదా. భార్య సొంతం... నా భార్య కాబట్టి– అదే–” అంటూ ఆగాడు సోమరాజు.

“అదే చెప్తున్నా– ఏదైనా అనుకోవటంలోనే వుంది చూసేదృష్టిని ఆలోచించే విధానాన్ని అదుపులోకి తెచ్చుకుని చూడగలిగితే అప్పలమ్మ గూడా అప్సరసలాగా కనిపిస్తుంది.” అంటూ సోమరాజు జేబులోంచి పెన్ను తీసుకుని తన జేబులో పెట్టుకున్నాడు. సోమరాజు అర్థం కాక పెన్నువంక పీకే వంక వెర్రి చూపులు చూస్తున్నాడు.

“చూశావా. పెన్ను నీది. నీ జేబులో వున్నంత సేపు నీకు దాన్ని గురించి ఆలోచనే రాలేదు. కారణం. నాది అనే చిన్నచూపు. నాజేబులోకి వచ్చేసరికి చిన్న అలజడి, ఆదుర్దా, ఇంట్రస్టు గూడాను. కారణం– అది నాదయిపోయింది కాబట్టి ఇంకా నీకు చాలా సంగతులు రహస్యాలు, చిట్కాలు చెప్పాలి. పద, టీ తాగుతూ మాట్లాడుకుందాం.” అంటూనే పీకేమూర్తి సోమరాజుని పాక హోటల్‌కి లాక్కుపోయాడు.

పీకేమూర్తితో మాట్లాడిన తర్వాత సోమరాజులో గొప్ప మార్పొచేసింది. ముఖ్యంగా భార్య విషయంలో చాలా ప్రేమగా వుంటున్నాడు. ఆమె ఏంచెప్పినా శ్రద్ధగా వింటున్నాడు. త్వరగా ఆఫీసునించి వచ్చేసి కబుర్లు చెపుతూ ఇంట్లోనే వుండిపోతున్నాడు.

కళ్యాణి వరకు అతను మారిపోయిన భర్త! ఆ సోమరాజుకి, ఈ సోమరాజుకి పోలికే లేదు... సినిమాకి వెడదాం అంటే ఇండస్ట్రీ మొత్తాన్ని తిట్టే అతను ఇప్పుడు సినిమా అంటే టక్కున రెడీఅయి “కమాన్ డార్లింగ్. నువ్వు త్వరగా రెడీ అవు” అని తొందరచేస్తున్నాడు.

ఒక్క సినిమా అనేకాదు. హోటల్లో భోజనం, షాపిగులు, కొనటాలు, అమ్మటాలు ఏదైనాసరే– అడిగితే చాలు– నీ ఇష్టం డియర్. నాదేం వుంది. నీ ఆనందం కన్నా నాకేం కావాలి అంటున్నాడు. మొదట్లో అదంతా నటనేమో అని భయపడిందిగాని

తర్వాత్తర్వాత తెల్సింది అది నటన కాదు. కాని ఇంత మార్పు ఎలా వచ్చింది అర్థంకాక సతమతమైపోయింది.

కాని చివరికి ఒక నిర్ణయానికి వచ్చింది.

మనిషి మారిపోయి, తనని బాగా చూసుకుంటున్నాడు. కారణం ఏదైతేనేం. అని సరిపెట్టుకోగలిగిందికాని ఒక్క విషయంలో సర్ది చెప్పుకోలేక సతమతమైపోతోంది.

సినిమాకి గానివ్వండి, షికారుకి కానివ్వండి, షాపింగుకి చివరికి గణేష్ నిమజ్జనం చూడటానికి వెళ్లవలసి వచ్చినా బయల్దేరే ముందు టక్కున గదిలోకి వెళ్లి తలుపులు మూసుకుంటాడు. అయితే అయిదు నిమిషాల కల్లా బయటికి సంతోషంగా,నవ్వుకుంటూ వచ్చి "కమాన్ డాళింగ్- సారీ లేటయానా?" అంటూ భుజం చుట్టూ చేతులు వేసి ఆప్యాయంగా లాక్కుపోతాడు.

ఆగదిలోకి అలా ఎందుకు వెడుతున్నట్టు? వెళ్లి లోపల ఏం చేస్తున్నట్టు? ఈ సంగతి మాత్రం తెల్సుకుని తీరాలని కళ్యాణి గట్టిగా నిర్ణయించుకుని తగిన సమయం గురించి ఎదురుచూడసాగింది.

ఆ రోజు రానేవచ్చింది. మంచికామెడీ పిక్చర్ వచ్చింది వెళ్లాలని కళ్యాణి పట్టుపట్టింది. కొత్త సోమరాజు వెంటనే ఓకే అన్నాడు. డ్రెస్సింగ్ చేసుకుని రెడీ అయ్యారు.

యథాప్రకారం "జస్ట్ వన్‌మినిట్" అంటూ సోమరాజు గదిలోకి వెళ్లి తలుపులు మూసుకున్నాడు.

కళ్యాణి ఆ సమయం గురించే ఎదురుచూస్తుండటం వల్ల, వేసుకున్న ప్లాన్ ప్రకారం రివ్వున పరిగెత్తి దొడ్డి వాకిలి గుండా గది వెనక్కువచ్చి కిటికీలోంచి

గదిలోకి రహస్యంగా చూసింది.

సోమరాజు గది మధ్యలో కళ్లు మూసుకుని చేతులు కట్టుకుని నిశ్చలమైన మనస్సుతో నిల్చుని తనలో తాను అనుకుంటున్నాడు కళ్యాణికి స్పష్టంగా వినిపించాయి. "అది నా భార్య కాదు- అది నా భార్య కాదు- అది నా భార్య కాదు. పరాయివాడి భార్య, పరాయివాడి భార్య, పరాయివాడి భార్య"అని.

అలా అనుకుంటుంటే సోమరాజు మొహంలో విచిత్రమైన వెలుగు, ఆనందం, సంతోషం తాండవించ సాగాయి. కళ్యాణి మాత్రం తెల్లబోయింది? ఇదా సోమరాజూ నీ సీక్రెట్టూ అని.